ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
సోమవారం 29 జులై 2024



ఘనంగా వన మహోత్సవం



విద్యార్థులతో అటవీశాఖ సిబ్బంది

కాకతీయఖని, జూలై 28: వన మహోత్సవం కార్యక్రమాన్ని అటవీ శాఖ అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి రేంజ్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం జంగేడులోని కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటారు. రేంజ్ అధికారి నరేష్ బస్వ, అధికారులు జాన్సీ, సంతోష్, ప్రశాంత్ యాదవ్, ఇబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

బొగత హోరు.. పర్యాటకుల జోరు

- జలపాతం సందర్శన పునఃప్రారంభం

వాజేడు, జూలై 28: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి కనిపించింది. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సందర్శనను ఆరు రోజులపాటు నిలిపివేసిన అటవీ శాఖ అధికారులు ఆదివారం పునఃప్రారంభించారు. ఈనెల 23న వరంగల్‌కు చెందిన యువకుడు జలపాతంలో గల్లంతై మృతిచెందడం, వరద ఉధృతి ఎక్కువగా ఉంటడంతో ఆంక్షలు విధించారు. .వాటిని ఎత్తివేయడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈతకొలనులోకి మాత్రం అనుమతి లేదని ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. చుట్టూ పచ్చని కొండల నడుమ నుంచి జాలువారుతున్న జలపాతం అందాలను చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు.

జలపాతం వద్ద పోలీసు రక్షణ

బొగత జలపాతం వద్ద జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా పోలీసులు రంగంలోకి దిగారు. పర్యాటకుల రద్దీ ఎక్కువ ఉండే రోజుల్లో పోలీసులు ప్రత్యేక దుస్తుల్లో జలపాతం వద్ద గస్తీ నిర్వహించనున్నట్లు ఎస్సై హరీశ్ తెలిపారు. ఆదివారం జలపాతం వద్ద పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. జలపాతం వద్ద ఆకతాయిలు, మద్యం సేవించి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు.



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

శాలరీ.. వర్రీ



"అసలే చిన్న ఉద్యోగం. చాకిరీ ఎంత చేసినా చాలీచాలని జీతం. ఇష్టంగా పనిచేస్తున్నా.. కష్టాలు అనుభవిస్తున్న జీవితాలు వారివి. సమయానికి వేతనాలు అందవు. ఎంత చెమటోడ్చినా.. కుటుంబంలో వెతలు తప్పవు. అటవీ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీనస్థితి ఇది."

- ఫారెస్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు
- నాలుగు నెలలుగా తప్పని నిరీక్షణ
- కష్టతరంగా మారిన కుటుంబ పోషణ
- నిధులు లేవంటున్న ఉన్నతాధికారులు

కాకతీయఖని, జూలై 28: అటవీశాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. సమయానికి జీతం రాక అవస్థలు పడుతున్నారు. రాత్రి అనక, పగలు అనక కష్టపడినా వేతనాలు చెల్లించకపోడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా తమకు జీతాలు అందడం లేదని, దీంతో దుర్భర జీవితాన్ని అనుభిస్తున్నామని అంటున్నారు. చిన్న చిన్న ఖర్చులకు సైతం చేతిలో చిల్లిగవ్వ కూడా లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మనస్తాపం చెందుతున్నారు. అడవి తల్లిని కాపాడుకోవడానికి నిరంతరం చెమటోడ్చుతున్నా తమను పట్టించుకునే వారే కరువయ్యారని అంటున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ శాఖలో ఒక సర్కిల్ కార్యాలయం, ఒకటి డిస్ట్రిక్ట్, రెండు డివిజన్, తొమ్మిది రేంజ్ కార్యాలయాలు ఉన్నాయి. వీటితోపాటు 46 సెక్షన్లు, 176 బీట్లు ఉన్నాయి. వీటిలో పనిచేసేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో 77 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. వీరిలో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు. డ్రైవర్లు, ఆపరేటర్లకు రూ. 26 వేల వేతనం ఉండగా అన్ని రకాల కటింగులు పోను వీరికి రూ. 17,500 అందుతున్నాయి. బేస్ క్యాంపు సిబ్బందికి రూ.12 వేలు జీతం ఉండగా రూ. 9,500 అందుతున్నాయి. వీరికి కాంట్రాక్ట్ ఏజెన్సీలు వేతనాలు ఇస్తుంటాయి. అయితే.. నాలుగు నెలలుగా ఈ ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. డ్రైవర్లకు మార్చి నుంచి జూన్ వరకు జీతాలు రాలేదు. అలాగే బేస్‌క్యాంపు సిబ్బందికి ఏప్రిల్ నుంచి జూన్ వరకు అందలేదు. ఇంకా రెండు రోజులైతే మరో నెల కూడా వచ్చేస్తుండగా ఇప్పటికీ వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని అధికారులే అంటున్నారు. ఈ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందించేందుకు ముఖ్యంగా అఫారెస్టేషన్, కంపా నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది. తద్వారా కాంట్రాక్ట్ సంస్థ జీతాలు పంపిణీ చేస్తుంది. ఇందుకు ప్రస్తుతానికి బడ్జెట్ మంజూరు కాలేదని తెలుస్తోంది.

చాకిరీ చేస్తూనే...

నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అనక, పగలు అనక ఉన్నతాధికారులను ఫీల్డ్‌పై తీసుకెళ్లేందుకు కష్టపడుతున్నామని డ్రైవర్లు, అహర్నిషలు అప్రమత్తంగా ఉంటూ అటవీ సంపదను కాపాడేందుకు శ్రమను ధారపోస్తున్నామని బేస్ క్యాంపు సిబ్బంది అంటున్నారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు చేయాల్సిన పనులు కూడా తాము చేస్తూ అష్టకష్టాలు పడుతున్నామని డేటా ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా తమకు జీతాలు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సమయానికి వేతనాలు వస్తున్నాయని, భారమంతా మీదేసుకుని పనిచేసే తమకు మాత్రం కష్టాలు తప్పడం లేదని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అంటున్నారు. ఇచ్చేది చాలీచాలని వేతనాలని, అవి కూడా సమయానికి రాకపోవడంతో పస్తులు ఉండాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు విధులు నిర్వర్తిస్తూనే వేతనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు నెలనెలా వేతనాలు వచ్చేలా కృషిచేయాలని కోరుతున్నారు.



భూపాలపల్లి డీఎఫ్‌వో కార్యాలయం

బిల్స్ ప్రభుత్వానికి పంపించాం

- వసంత, భూపాలపల్లి డీఎఫ్‌వో



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతన బిల్లులను ప్రభుత్వానికి పంపించాం. ఇంకా అవి పెండింగ్‌లో ఉన్నాయి. అఫారెస్టేషన్ పరిధిలో పనిచేసే వారికి టోకెన్ రాలేదు. ప్రభుత్వం నుంచి అప్రూవల్ రాగానే వేతనాలు చెల్లిస్తాం. ప్రస్తుతం కాంపా పరిధిలో పనిచేస్తున్న వారికి టోకెన్ అప్రూవల్ వచ్చింది. ఈనెల చివరి నాటికి లేదా వచ్చే నెల మొదటి వారంలో జీతాలు అందుతాయని తెలుస్తోంది.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 28: జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ప్రజలు ఖాళీ చేయాలని, సహాయక చర్యల్లో అధికారులకు సహకరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎగువన, స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి వరద హైలెవల్‌కు పెరుగుతూ, తగ్గుతూ ఉందని తెలిపారు. లోతట్టు గ్రామాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పెరికలకుంట గ్రామంలోని పాండ్ల వెంకటరమణ- మల్లేశం ఇల్లు శిథిలావస్థలో ఉన్న విషయాన్ని గ్రహించి మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి ముందస్తుగా ఇంట్లో ఉన్నవారిని, సామగ్రిని బంధువుల ఇంటికి తరలించినట్టు తెలిపారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి గోడ కూలిపోయిందని, దీంతో ఆ కుటుంబ సభ్యులు ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఆయన కోరారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కోసం ఏటూరునాగారం ఐటీడీఏలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని, 24గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆపదలో ఉన్నవారు సెల్‌నంబర్ 6309842395, 0817-293246ను సంప్రదించాలని సూచించారు.



తెలంగాణతల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

ఉద్యమకారుల వినూత్న నిరసన

గోవిందరావుపేట, జూలై 28: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణతల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్నంగా నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా మురహరి భిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగస్వామ్యమై పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 250 గజాల ఇంటి స్థలంతోపాటు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసంఅసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు హేమాద్రి, అజ్మీరా సురేష్, బత్తుల రాణి, అకినపల్లి రమేష్, లకావత్ చందూలాల్, కొండి రమేష్, బానోత్ గోపీచంద్, కొండా రమేష్, రేండ్ల శ్రీను పాల్గొన్నారు.

కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ
- ఈ సీజన్ నుంచే మొదలు పెట్టే ఆలోచన
- త్వరలో మార్గదర్శకాలు జారీ
- అప్రమత్తమవుతున్న వ్యవసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు

7

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అమర జవానుస్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 28: యుద్ధంలో సైనికులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో అమర జవాను స్థూపం వద్ద ఆయన నివాళులు అర్పించారు. అనంతరంమాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారతదేశం విజయం సాధించి పాతికేళ్లవుతోందని, ఆ రణభూమిలో మన సైనికులు చేసిన త్యాగాలు తరతరాలుగా గుర్తుండిపోతాయని అన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవానుల త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అమర జవానుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వాటి అభ్యున్నతికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బేతోజు మురళీకృష్ణ, మాజీ సైనికులు అభిషేక్ గుప్తా, అఖిల భారత పూర్వ సేవా సమితి సుబేదార్ మేజర్ స్వామి, జనార్దన్‌రెడ్డి, రవి, అమర జవాను సతీమణి ఆశా, కాంగ్రెస్ నేతలు చల్లూరి మధు, దాట్ల శ్రీనివాస్, ఇస్లావత్ దేవన్, రాజేందర్ పాల్గొన్నారు.

కన్న కొడుకు చేతిలో గాయపడి..

- చికిత్స పొందుతూ మహిళ మృతి



సమ్మక్క (ఫైల్)

మొగుళ్లపల్లి, జూలై 28: కన్న కొడుకే రోకలి బండతో బలంగా దాడి చేయడంతో చికిత్స పొందుతూ తల్లి శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొరికిశాల గ్రామానికి చెందిన అప్పం సమ్మక్క (59)కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ వివాహం భార్య విడాకులు ఇచ్చి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటినుంచి రాజ్ కుమార్ ఎలాంటి పని చేయకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతూ ఉండేవాడు. ఆరునెలల క్రితం తండ్రి రాజయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లిని రాజ్ కుమార్‌తరచూ తిడుతూ తీవ్రంగా కొట్టేవాడు. దీంతో ఆమె భయపడి చుట్టుపక్క ఇళ్లలో తలదాచుకునేది. ఈనెల 26న తల్లి సమ్మక్క ఇంట్లో బల్లపై పడుకోగా రాజ్‌కుమార్ ఒక్కసారిగా రోకలిబండతో ముఖంపై బలంగా దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించగా పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈనేపథ్యంలో సమ్మక్క ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి రెండో కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

- 16న దాడి చేసి గాయపర్చిన వీధి కుక్కలు



చంద్రవ్వ (ఫైల్)

టేకుమట్ల, జూలై 28: కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రామకిష్టాపూర్ (వీ)లో నివసిస్తున్న ఆకునూరి చంద్రవ్వ (64)పై ఈనెల 16న వీధి కుక్కలు దాడి చేశాయి. గుడిసెలో ఆమె నిద్రిస్తుండగా తడకలను తొలగించి లోపలికి దూరి గాయపర్చాయి. తీవ్ర అస్వస్థతకు గురైన చంద్రవ్వను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది.

తగ్గుముఖం పట్టిన గోదావరి

మహదేవపూర్, జూలై 28 : మండలంలోని కాళేశ్వరం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. 17 రోజులుగా ఉధృతంగా ప్రవహించింది. పుష్కరఘాట్ మెట్లను సైతం తాకింది. ఆదివారం కాస్త శాంతించింది. దీంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.

- ఏటూరునాగారం రూరల్: గోదావరి తగ్గుముఖం పడుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి శాంతించింది. ఆదివారం ఉదయం 7 గంటలకు 15.010 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 14.630 చేరి క్రమంగా తగ్గింది. సాయంత్రం 7గంటలకు 14.500 మీటర్ల మేర ప్రవాహం ఉంది. అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

అంధుడి కుటుంబంలో 'ఖాకీ' వెలుగులు

● దీనస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి బాసట ● పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

నర్సింహులపేట, జులై 28 : దీనస్థితిలో ఉన్న ఓ అంధుని కుటుంబంలో పోలీసులు వెలుగును నింపారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారి సూచన మేరకు స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ తన సిబ్బందితో కలిసి కొందరు దాతల ఆర్థిక సాకారంతో నూతన ఇల్లు నిర్మించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్సింహుల పేట మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన నిరుపేద అంధుడు మందుల నాగన్న పాటలు పాడుతూ వచ్చిన కొద్దోగొప్పో డబ్బుతో తన కుటుంబాన్ని సాకుతున్నాడు. పుట్టుకతోనే అంధుడు కావడంతో తనకు తోడుగా వచ్చే తల్లీ బక్కమ్మ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికావడంతో పాటు తను ఉండే ఇల్లు శిథిలావస్థకు చేరిందన్న విషయం స్థానిక పోలీసుల ద్వారా జిల్లాపోలీస్ అధికారికి చేరింది. వెంటనే స్పందించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అంధుని కుటుంబానికి అండగా ఉంటానని, దాతలు ముందుకు వచ్చేలా చొర వ తీసుకోవాలని ఎస్సై సతీష్‌కు సూచించారు. ఎస్పీ సూచనల మేరకు ఎస్సై సతీష్ సిబ్బందితో అంధుడి ఇంటికి చేరుకున్న అతని దీనస్థితిని చూసి చలిం చి, తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు ఇచ్చాడు. గూడు నిర్మించేలా సహకారం అందిస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చాడు. మండలానికి చెందిన కొందరు దాతలు జినుకల రమేశ్, ఉల్లి శ్రీను, శ్రీరాం శేషయ్య, నలమాస రాజు, దాసరోజు రాజశేఖర్‌తో పాటు మరికొందరి సహకారంతో సుమారు రూ.2.50 లక్షలతో రెండుగదుల ఇంటి నిర్మాణాన్ని 20 రోజుల వ్యవధిలోనే చేపట్టారు. ఆ నూతన గృహాన్ని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదివారం ప్రారంభించి, అంధుడు నాగన్నకు తల్లి బక్కమ్మకు నూతన వస్త్రాలను అందజేశారు. ఇంటి ఆవరణలో మామిడి మొక్కను నాటారు.


నూతన ఇంటి ముందు ఎస్పీ సుధీర్‌రాంనాథ్

అక్రమ వ్యాపారాలు చేస్తే ఉపేక్షించం..

జిల్లాలో గుడుబా, నల్లబెల్లం, గాంజా లాంటి అక్రమవ్యాపారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు శాంతి భద్రతల నిర్వహణతో పాటు సమాజంలో సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. పనితీరును బట్టే పోస్టింగ్‌లు, రివార్డులు ఉంటాయన్నారు. జిల్లాలో నల్లబెల్లం, నాటుసారా పూర్తిస్థాయి నివారణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. పోలీసుల పనితీరును బట్టే సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయన్నారు. జిల్లా పరిధిలో ఉన్న రహదారులపై రోడ్డుప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం పరిధిలో యూనిట్‌గా ఏర్పడి ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పెంచుకోవాలన్నారు. మత్తు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. నిరుపేద అంధుడు నాగన్న నూతన ఇంటి నిర్మాణానికి ప్రత్యేక చొరవతీసుకున్న ఎస్సై సతీష్‌ను, సిబ్బందిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, దాసరోజు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, శేరి రామకృష్ణ, శ్రీరాంశేషయ్య, ఉల్లి శ్రీను, నలమాస రాజు పాల్గొన్నారు.


మౌన దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కాళోజీ జంక్షన్, జూలై 28: పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సభకు వందలాదిగా పెన్షనర్లు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల పెన్షనర్ల సమావేశం జరిగింది. దీనికి నర్సింహారెడ్డి అధ్యక్షత వహించగా, పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల కరువు భత్యం వాయిదాలను విడుదల చేయాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ధర్నాచౌక్ వద్ద నిర్వహించే మౌన దీక్ష కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 150 మంది పెన్షనర్లు పాల్గొనే విధంగా సంఘాల బాధ్యులు కృషి చేయాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన 25మంది, స్పెషల్ టీచర్ల పక్షాన 20మంది మౌనదీక్షకు హాజరవుతామని నాగపురి సారయ్య, పెద్దూరి పెద్దన్న, సుధాకర్‌లు ప్రకటించడాన్ని సమావేశం స్వాగతించింది. చివరగా మౌన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు


నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 28: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఏషియన్ మాల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ స్కూల్ సమీపంలో ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన ప్రకారం.. సుబేదారి ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని విచారించగా ఒకరు ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన విద్యార్థి చౌలం దొరబాబు, మరొకరు కమలాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మంత్రి సంజయ్‌కుమార్ అని తెలిసినట్లు చెప్పారు. వీరిద్దరూ గంజాయికి బానిసై ఒడిషా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి హనుమకొండలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్


పట్టుబడిన జేసీబీలు, టిప్పర్‌ను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, జూలై 28: మండలంలో రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన ప్రకారం... లింగమోరిగూడెంలో నిల్వచేసిన మట్టితో కూడిన ఇసుకను అనుమతి లేకుండా జేసీబీ ద్వారా లోడింగ్ చేస్తుండగా పట్టుపడింది. అదేవిధంగా పున్నేలు శివారు వడ్డెరిగూడెంలో అనుమతి తీసుకోకుండా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా జేసీబీ, టిప్పర్ పట్టుపడ్డాయి. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండుగ్రామాల్లో 100 కాల్ ఆధారంగా వెంటనే స్పందించి ఇసుక, మొరం అక్రమ రవాణాను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

రూ. 2లక్షల 30వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 28 : గంగారం మండలం పెద్దఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి తనకు తెలియకుండా రూ. 2లక్షల 30 వేలు మాయం కావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఎల్లాపూర్‌కు చెందిన గుండగాని శ్రీధర్ ఖాతా నుంచి రూ. 2 లక్షల 30 వేలు డ్రా కావడంతో సైబర్ నేరగాళ్లు తన ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అనుమానాస్పద లింకులపై టచ్ చేయొద్దని, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని ఎస్సై సూచించారు.

కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ
- అప్రమత్తమవుతున్న వ్యవసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు



హనుమకొండ, జులై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయి. ఈ వానా కాలం పంటల నుంచే కౌలు రైతులకూ పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కౌలుదారులకు రైతు భరోసా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై మార్గదర్శకాలను త్వరలోనే రూపొందిస్తామని తెలిపింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. అధికారులు కూడా ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చే పనిలో నమగ్నమయ్యారు.

ఎకరాకు రూ.20వేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 4,78,562 మంది ఉన్నారు. వీరికి ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు తమకున్న కొద్దిపాటి భూమితో పాటు పక్కనున్న ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఫలితంగా వీళ్లు కూడా సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. దేవాదుల ఎత్తిపోతల, ఎస్ఆర్ఎస్పీ కాలువ ఆయకట్టు, ఇతర ప్రధాన రిజర్వాయర్లు, పెద్ద చెరువుల కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.20వేలను భూమి సొంతదారులకు చెల్లిస్తున్నారు. కాలువలు, కుంటలు, బోరు బావులు కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరానికి రూ.10వేల వరకు చెల్లిస్తున్నారు.

అప్పుల ఊబిలో..

వర్షాధార పంటల్లో ఇతర పంటలతో పోల్చితే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపుతున్నారు. పంట చేతికి వచ్చినా, రాకపోయినా కౌలును మాత్రం చెల్లించాల్సిందే. కౌలుతోపాటు పెట్టుబడులు పెట్టి పంటలు పండించడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలేమి వర్తించవు. బ్యాంకుల నుంచి కనీసం రుణాలు కూడా అందవు. అప్పులు చేసి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. ప్రకృతి వైపరిత్యాలవల్ల పంట నష్టపోతే పరిహారం కూడా అందదు, అధిక వడ్డీ భారంతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రైతు భరోసాలో భాగంగా కౌలు డబ్బులు చెల్లిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

గతంలో ప్రకటించి..

2014కు ముందు అప్పటి ప్రభుత్వాలు కౌలు రైతులకు అధీకృత కార్డులు పంపిణీ చేశాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ కార్డులు పని చేయడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన కర్షకులకు రైతు బంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌలు రైతులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. అధిక వడ్డీకి అప్పులు చేసి పంట ఉత్పత్తులను తిరిగి అదే వ్యాపారులు అమ్ముకోవాల్సి రావడంతో కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

మార్గదర్శకాలు ఎప్పుడో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనేదానిపై స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాలోని మూడు లక్షలుపైగా కౌలు రైతులు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఏటా హనుమకొండ జిల్లాలో 1.40 లక్షలు, వరంగల్ జిల్లాలో 2.50 లక్షలు, జనగామ జిల్లాలో 1.68 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.21 లక్షలు, ములుగు జిల్లాలో 1.10 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఇప్పటివరకు కౌలు రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మొదలైన కసరత్తు

కౌలు రైతులకు రైతు భరోసా అమలు దృష్ట్యా తాజాగా జిల్లాల వారీగా ఎంత విస్తీర్ణంలో వారు పంటలు పండిస్తున్నారో ఆరా తీస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు సాగవుతున్నాయనే వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికే పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రాత పూర్వక ఆదేశాలు అందగానే కౌలురైతుల వివరాలు సమర్పిస్తామని ఉమ్మడి ఇల్లాలోని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నిరాకరణ

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో భూము యజమానులు కలవరపడుతున్నారు. కౌలు రైతులకు పత్రాలు రాసిచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసిస్తే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమౌతామోనని భూయజమానులు భయపడుతున్నారు. ఒక వేళ కౌలు రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇచ్చినట్లయితే కౌలు మొత్తాన్ని పెంచే యోచనలో ఉన్నారు. కాగా, గుర్తింపునకు ప్రామాణికమైన కౌలు పత్రాలు లేకపోతే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమవుతాయని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

కౌలు రైతులు 3 లక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. 10.50 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో పట్టాదారు 9.50 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల సుమారు లక్ష మందికి ఇప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 3 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. వీరిలో చాలామంది 3 నుంచి 5 ఎకరాల వరకు భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించుకుంటున్నారు. వీరిలో 2 నుంచి 3 ఎకరాలు కౌలు తీసుకొన్నవారే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

నేటి నుంచి దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీలు

వరంగల్ కల్చరల్, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. సోమవారం బదిలీల ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈనెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది, వివిధ హోదాలు గ్రేడ్‌లలో ఉన్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. బదిలీల ప్రక్రియల నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈవోలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈవోలు శనివారం రాత్రి హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణను కలిశారు. దాదాపు 125మంది ఈవోలు ఆర్‌జేసీని కలిశారు. బదిలీల ప్రక్రియ విషయంపై చర్చించినట్లు తెలిసింది. అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జూలై 31తో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానచలనం కలగనుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 200కుపైగా ఆలయాలు ఉండగా వరంగల్ జిల్లాలో 60కిపైగా దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉన్నాయి. నగరంలో 25కు పైగా ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయానికి ఇప్పటి వరకు మూడు నుంచి నలుగురు సిబ్బంది అవసరం ఉండగా ఒక్కరితోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఈవోలు, సిబ్బంది కొరత

ఒక్కో ఆలయానికి నలుగురు సిబ్బంది నాలుగో గ్రేడ్ ఉద్యోగులతోపాటు స్వీపర్, వాచ్‌మెన్‌లు ఉండాలి. వీరితోపాటు ఈవో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది కొరతతోపాటు ఈవోల కొరత కూడా ఉంది. ఒక్కొక్క ఈవోకు నాలుగు నుంచి ఐదు దేవాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. దీనికి తోడు ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులు అసలు విధులే సరిగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 28: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓఆర్ఆర్‌పై ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు చెట్ల పొదల మధ్య గంజాయి సేవిస్తూ కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఖానాపురానికి చెందిన పి.రాజేష్, పి.అనిల్, ఎల్లాయిగూడెంకు చెందిన విపిన్ కుమార్‌గా గుర్తించారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



అరెస్టు అయిన ముగ్గురు యువకులు



మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

కమ్మ కులస్థులకు దాన గుణం ఎక్కువ

న్యూశాయంపేట, జూలై28: కమ్మ కులస్థులకు దాన గుణం కలవారని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఫౌండర్, చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్‌లో ఆషాఢమాస వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జెట్టి కుసుమకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమ్మ కులస్థులు ఐక్యంగా ఉండాలన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా ప్రపంచంలో కమ్మ కులస్థులు ఎక్కడ ఉన్నా ఒక్క దగ్గర చేర్చి కులాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకెళదామన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కూచిపూడి నృత్యం, భరతనాట్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మాదాల కాశయ్య, పూర్వ అధ్యక్షుడు మాందాటి కోటేశ్వర్‌రావు, కమ్మం సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారెడ్డి, పట్టాభిరామయ్య, నరేష్, రామచందర్‌రావు, కూనాటి హరిబాబు, వెంకటేశ్వర్లు, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, రాంబాబు, అనిల్‌కుమార్‌తోపాటు పెద్ద సంఖ్యలో కమ్మ కులస్థులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాముల పైడి, గునిగంటి రమేష్‌లను ఏకగ్రీంగా ఎంపిక చేసినట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఆదివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన 8వ డివిజన్ కుమార్‌పల్లిలోని న్యూలయోలా హైస్కూల్‌లో రాష్ట్ర కమిటీ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్యతో పాటు సీనియర్ న్యాయవాదులు షైదం జయపాల్, చేవూరి విజయ ముఖ్య అతిథిలుగా హాజరు కాగా, జిల్లా కమిటీలో పోటీ లేకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా చేవూరి విజయ, అధ్యక్షుడిగా శ్రీరాముల పైడి, ప్రధాన కార్యదర్శిగా గునిగంటి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల రవి, పీసరి రజిత, రుద్రారపు హేమలత, జిల్లా కార్యదర్శులుగా ఎం.డి. హసీనా బేగం, తరాల సమ్మక్క, తరాల శంకర్, ప్రచార కార్యదర్శులుగా ఎం.డి. షహీదా బేగం, గుగులోతు సోనమ్మ, కార్యవర్గసభ్యులుగా భూక్యా అనసూర్య, బానాల మరియా, బోగి రాకేష్, సూడిద మహేందర్, బరిగెల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సాంబయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క బిక్షపతి, కార్యదర్శి పార్నంది రమేష్‌చంద్ర, రాష్ట్ర నాయకులు కొంగర సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి

బాలసముద్రం, జూలై 28: వివాహాది శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు వినియోగించుకోవాలని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. వరంగల్-1 డిపో నుంచి అద్దె ప్రాతిపదికన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడప్లస్ విహారయాత్రల కోసం 9959226047, 7382855793 నంబర్లను సంప్రదించాలని డీఎం మోహన్‌రావు అన్నారు.

సాహిత్యం సమాజ మార్గనిర్దేశనం చేయాలి..

గ్రంథావిష్కరణలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, జూలై 28: సాహిత్యం సార్వజనీనమైనదని, ఏ ప్రక్రియలో సాహిత్యం స్పృశించినా అది సమాజ మార్గనిర్దేశనం చేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని ఎలక్ట్రిసిటీ భవన్‌లో ఆచార్య బన్నా ఐలయ్య అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో వెటర్నరీ వైద్యుడు కాయిత వెంకటి కలం నుంచి జాలువారిన 7వ గ్రంథం నేను నా జీవిత ప్రస్థానాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన అనుభవాన్ని రంగరించి తన జీవితానుభవంలో ఎదురైన అనేక సంఘటనలు పాఠకులకు అనుకూలంగా ఆసక్తిగా మలచి రేపటి తరాలు ఆదర్శంగా తీసుకునేలా రాసిన రచయితను అభినందించారు. ప్రముఖ రచయిత్రి అరుణకీర్తి పతాక కరాజుల గ్రంథాన్ని సమీక్షిస్తూ దళితుల సమీక్షపై అనేక ఆసక్తికర సంఘటనలను అద్భుతంగా మలచి పాఠకులకు చేరువైనారని అన్నారు. కొన్ని సంఘటనల ఆధారంగా మలిచిన గేయాన్ని వినిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ హరినాథ్‌రావు, నిధి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, తదితరప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు అరసం వరంగల్ కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో సాహిత్య అభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

- ఐక్య విద్యార్థి సంఘాల నేతల వెల్లడి
- కేయూ వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం



ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూక్యాంపస్, జూలై 28: ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేసే విద్యా వ్యాపారాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాల నాయకులపై యజమానులు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఐక్య విద్యార్థిసంఘాల నేతలు హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు, ఒకే బ్రాంచ్‌కి అనుమతి పొంది అనేక బ్రాంచ్‌లు నిర్వహించడం, ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని డిమాండ్ చేశామని చెప్పారు. తమ అగడాలు బహిర్గతమవుతున్నాయనే అక్కసుతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హనుమకొండ కలెక్టర్‌కు తమపై వినతి పత్రాన్ని ఇవ్వడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై పోరాటం చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. నిజాయితీగా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుస్తున్న కళాశాలల యాజమాన్యాలు తమతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ భవిష్యత్ కార్యాచరణ సోమవారం ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు రోహిత్, ఏబీఎస్ఎఫ్ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భరత్, ప్రణయ్, బీఎస్ఎఫ్ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఇష్టారాజ్యం

- నగరంలో గల్లీకొకటి చొప్పున వందలాది హాస్టళ్ల ఏర్పాటు
- అనుమతులు, నిబంధనలు లేకుండా నిర్వహణ
- కలుషిత వాతావరణం, నాసిరకం భోజనంతో విద్యార్థుల అవస్థలు
- కొన్ని చోట్ల వ్యభిచారం, నేరాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారులు, పోలీసులు దృష్టి పెట్టాలని వినతులు



హనుమకొండ టౌన్, జూలై 28: హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్ల హవా నడుస్తోంది. కొంతమంది అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా హాస్టళ్లను ఏర్పాటు చేసి వ్యాపారంగా మలుచుకుంటున్నారు. హనుమకొండ నయీంనగర్, హంటర్‌రోడ్డు, చౌరస్తా, ములుగురోడ్డు, భీమారం, వరంగల్ రంగంపేట, పోచమ్మమైదాన్, పోస్టాఫీసు, రంగశాయిపేట, బొల్లికుంట, కాజీపేట, నిట్ ప్రాంతాల్లో కళాశాలలను అడ్డాగా చేసుకొని వందలాది హాస్టళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎలాంటి అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రమాణాలు కరువు

ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వరంగల్ నగరానికి చదువులు, ఉద్యోగాలు, వివిధ పనుల కోసం చాలామంది వస్తుంటారు. సొంతంగా రూమ్‌లు తీసుకుని ఉండడం భారమైన వారు.. ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయిస్తుంటారు. అక్కడ నిర్వాహకులు చెప్పిన ఫీజును చెల్లించి ఉంటున్నారు. అయితే అదే అదునుగా భావించిన కొంత మంది నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులే పరమావధిగా భావిస్తూ ఎవరు వచ్చినా హాస్టల్‌లో చేర్చుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అడ్మిషన్ తీసుకున్న వారు ఇచ్చిన చిరునామా నిజమైనదేనా? అనేది చూడరు. ప్రైవేటు హాస్టల్‌లో మెయింటెనెన్స్ రిజిస్టర్ కనిపించదు. హాస్టల్‌లో దేని కోసం ఉంటున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంటున్నారు? పక్కవారితో ఎలా ప్రవర్తిసున్నారు? రోజూ రాత్రి హాస్టల్‌లో ఉంటున్నారా? లేదా? అనేదానిపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా లేడీస్ హాస్టల్స్ వద్ద రక్షణ లేకుండా పోయింది. వాచ్‌మెన్‌లను నియమించడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోరు. ఫైర్ సెఫ్టీ ఉండదు. కేవలం నాలుగు గదుల ఇల్లు దొరికితే చాలు.. తెల్లారేకల్లా హాస్టల్ అంటూ బోర్డు పెట్టి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్లలోనే నిర్వాహకులు నివాసం ఉంటుండడంతో శుభకార్యాలు, మందుపార్టీలు చేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలున్నాయి. కొన్ని హాస్టళ్లను అనుకొని లాడ్జిలు నెలకొల్పబడ్డాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

నగరంలోని ప్రైవేటు హాస్టళ్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ ఆహారం ఎలా తయారు చేస్తున్నారు? శుభ్రత పాటిస్తున్నారా? అనే దానిపై అధికారులు ఏనాడూ పరిశీలించిన పాపాన పోలేదు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రైవేట్ వసతి గృహాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేయగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కుళ్లిపోయిన కూరగాయలు, శుభ్రతలేని కిచెన్, కలుషితమైన నీరు.. ఇలా రకరకాల సమస్యలు బయటపడ్డాయి. అదే తరహాలో వరంగల్ నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులతో పాటు మునిసిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న అక్రమాలు, నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది రెండు, అంత కన్నా ఎక్కువ హాస్టళ్ల నిర్వహిస్తున్నారని, అలాంటి వారు రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాంటి వారిపై దృష్టిసారించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

కొన్ని సంఘటనలు

- ఒక మహిళ వివాహం చేసుకొని భర్తను వదిలిపెట్టి హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌లో ఉంటూనే బయట వేరే గది కిరాయి తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోంది. విటుడు దొరికినప్పుడు రూమ్‌లో గడిపి వస్తుంటుంది. ఈ క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేయగా మహిళను ఆదుపులోకి తీసుకొని వదిలేశారు. మహిళ ఒక్కరే ఈ వ్యభిచారంలో పాల్గొనేదా..? హాస్టల్లో ఉన్న అమ్మాయిలకు డబ్బు ఎరవేసి ఈ రొంపిలోకి దింపిందా? అనేదానిపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.
- నయీంనగర్ పెద్దమోరీ సమీపంలో హాస్టల్‌లో ఉంటూ ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ మహిళ స్నానం చేస్తున్నప్పుడు హాస్టల్ నిర్వాహకుడు బాత్‌రూమ్‌లోకి చొరబడి లొంగదీసుకున్నాడు. దాన్ని ఆసరాగా చేసుకొని లైంగికంగా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- కోరుట్లకు చెందిన ఇద్దరు అమ్మాయిలు స్వలింగ సంపర్కులుగా మారి హాస్టల్‌లోనే కాపురం పెట్టారు. నిత్యం రూమ్‌లోకి పోయి తలుపులు పెట్టుకోవడం.. ఇద్దరు కలిసి స్నానం చేయడంతో పాటు అందరిముందే అసభ్యకంగా ప్రవర్తిస్తుండటంతో పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించి హాస్టల్‌ను ఖాళీ చేయించారు.
- ఓ హాస్టల్‌లో అసౌకర్యాలతోపాటు మోరాలపై ప్రశ్నించిన యువతిని హాస్టల్ అసోసియేషన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నిర్వాహకుడు ఇష్టానుసారంగా దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- కిషన్‌పురలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న డిగ్రీ విద్యార్థిని ప్రతీ రోజు రాత్రి బయటికి వెళ్లి తిరిగి ఉదయం హాస్టల్‌కు చేరుకుంటోంది. రోజూ అదే పనిగా వెళ్లి వస్తుండటంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకుపోగా బాయ్‌ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.
- నయీంనగర్ రంగ్‌బార్ సమీపంలో గర్ల్స్, బాయ్స్ హాస్టల్స్ పక్కపక్కనే ఉండటంతో వెకిలిచేష్టలు, అసభ్య ప్రవర్తన చేయడంతో గర్ల్స్ హాస్టల్ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడితోపాటు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెటీరియల్ రిలీజ్‌కు ఈ-స్టోర్ విధానం

హనుమకొండ టౌన్, జూలై 28: వినియోగదారులకు సత్వరమే సేవలందించడంలో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్‌లో కొత్తగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఈ మొదటగా ఒక పనికి కావల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో లేదో సాప్(ఎస్ఏపీ)సాఫ్ట్‌వేర్‌లో, ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్‌ను రిజర్వు చేసుకుంటారని పేర్కొన్నారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్‌కు సంబంధించిన సమాచారం ఎస్ఏపీ వర్క్ ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళుతుందని తెలిపారు. మెటీరియల్ తీసుకోవడానికి ఏ రోజు రావాలో తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, ఎస్ఏపీ మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని వివరించారు. తెలియజేసిన తేదీ సమయానికి స్టోర్‌కు వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దీనిలో పేపర్ ప్రస్థావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టక ముందు కావాల్సిన మెటీరియల్ లిస్టును ప్రింట్ తీసుకొని సంతకాలు తీసుకొని ఆ పేపర్ సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవల్సి ఉండేదని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికే ఈ-స్టోర్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఏపీ టీం చేశారని తెలిపారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు 24గంటల పాటు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

మహదేవపూర్, జూలై 28: మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. మహదేవపూర్ సీఐ రామచంద్రరావు, ఎస్సై చక్రపాణి ఆధ్వ ర్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలను సేకరించారు.

- గోవిందరావుపేట : మండలంలోని గొత్తికోయగూడాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. మండలంలోని పందిరిదోన గొత్తికోయగూడాన్ని సందర్శించి గొత్తికోయలతో సమావేశమయ్యారు. గూడెంలోకి కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.
- వాజేడు: మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు రాజకీయ నాయకులు, అధికార ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. వారోత్సవాలు ముగిసే వరకు పల్లెల్లో ఉండొద్దని ఆదేశాలు జారీ చేసి హిట్ లిస్టులో ఉన్న నాయకులను ప్రతిరోజూ అప్రమత్తం చేస్తున్నారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు ఆదేశాలు ఇస్తుండటంతో నాయకులు పల్లెలను ఖాళీ చేస్తున్నారు. ఇసుక సొసైటీల ఆన్‌లైన్‌ను సైతం నిలిపివేసి భారీ వాహనాలను స్టేషన్లకు తరలించారు. వెంకటాపురం సీఐ కుమార్, వాజేడు, పేరూరు ఎస్సైలు హరీశ్, కృష్ణప్రసాద్ నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తం అవుతున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



ఆటోను తనిఖీ చేస్తున్న వెంకటాపురం పోలీసులు

- ములుగు రూరల్: మండలంలోని బోడరాయగడ్డ గుత్తికోయగూడెంలో ములుగు సీఐ శంకర్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం జరిగింది. అందులో భాగంగా గూడెం వాసులతో సీఐ మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరినీ బడికి పంపాలన్నారు. యువత గుడుంబా, గుట్కా, గంజాయి మహమ్మారి బారిన పడకుండా చూడవల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గూడెంలో అపరిచితులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం బొగ్గులవాగును సందర్శించారు. బ్రిడిపై నుంచి నీళ్లు ప్రవహించడం వల్ల డ్యామేజ్ అయ్యిందని, ప్రయాణికులు ఎవరూ రావద్దని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు): మండలంలోని యాకన్నగూడెం శివారులో ఆదివారం ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిత్యం తనిఖీలు చేస్తున్నారు. మండలకేంద్రానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.
- ఏటూరునాగారం: మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఏటూరునాగారం అడవులను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మండల కేంద్రంలోని వైజంక్షన్ మలుపు వద్ద, బూర్గంపాడు-ఏటూరునాగారం జాతీయ రహదారిలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, రెండో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీ చేశారు. వివిధ అడవులల్లో నివాసం ఉంటున్న గొత్తికోయగూడాల్లో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు సంచరించి ఇంటింటా సోదాలు చేస్తున్నారు.
- కాటారం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు మండలంలోని 353(సీ)జాతీయ రహదారిపై పలు చోట్ల ఎస్సై మ్యాక అభినవ్ వాహనాల తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వదిలేశారు.

వంతెన మరమ్మత్తు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



వంతెన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

టేకుమట్ల, జూలై 28: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య ఉన్న వంతెన మరమ్మతు పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, నాయకులు తదితరులు ఉన్నారు.

రామప్పను సందర్శించిన నేషనల్ టూరిస్టు గైడ్స్



రామప్ప దేవాలయం ఆవరణలో నేషనల్ టూరిస్ట్ గైడ్స్

వెంకటాపూర్(రామప్ప), జూలై 28: మండలంలోని రామప్ప రామలింగేశ్వర దేవాలయాన్ని నేషనల్ టూరిస్ట్ గైడ్స్ ఆదివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం దేవాలయ శిల్ప సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని తమ కెమెరాల్లో బంధించుకున్నారు. ఈ బృందంలో నేషనల్ టూరిస్ట్ గైడ్స్ జయచంద్రన్, జయరాజ్, అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, జోజాన్, షాక్సీల్, జిషోయ్, అలెక్స్, సుకంద, నాగసుబ్రహ్మణ్యాన్ తదితరులు ఉన్నారు.

జలగలంచలో పాఠశాల ఏర్పాటు చేయాలి

తాడ్వాయి, జూలై 28: మండలంలోని జలగలంచ గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం వారు జలగలంచ గొత్తికోయగూడాన్ని సందర్శించారు. గొత్తికోయల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గూడెంలో పాఠశాల లేకపోవడంతో చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అదేవిధంగా గూడెంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు కరెంటు సౌకర్యం కల్పించాలని, గొత్తికోయ పిల్లలకు కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్లు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈకార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న, ప్రజాసంఘాల నాయకుడు దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి : సీపీఎం

ములుగు కలెక్టరేట్, జూలై 28: ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.గఫూర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో కొర్ర రాజు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో గఫూర్ మాట్లాడారు. రైతు రుణమాఫీలో కొంతమంది అర్హులకు రుణాలు రద్దు కావడంలేదని, ఏజెన్సీ ప్రాంతంలోని రైతుల భూములకు పట్టాలు కాలేదని, పహణీల ద్వారా రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తింజేయాలని, వానాకాలం రైతుభరోసా డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ధరణి లోపాలను సరిచేయాలని, దొడ్డురకం ధాన్యానికి కూడా బోనస్ వర్తింపజేయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రత్నం ప్రవీణ్, జన్ను దేవేందర్, ఎమ్డీ.సద్దాంహుస్సేన్, కలువల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మొద్దులగూడెంలో ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గోవిందరావుపేట, జూలై 28: మండలంలోని పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామంలోని పిట్టల నర్సయ్య కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు గమనించి నర్సయ్య కుటుంబ సభ్యులను బయటకు తీసుకొచ్చారు. వెంటనే ములుగు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వాహనం చేరుకునే సరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కురుమ సంఘం పట్టణ నూతన కమిటీ ఎన్నిక

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 28: భూపాలపల్లి పట్టణ కురుమ సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం ఎన్నికల కోఆర్డీనేటర్లు కోరే సుధాకర్, అమృత అశోక్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పక్కల సారయ్య, అధ్యక్షుడిగా కోరే కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా అల్లి చేరాలి, ఉపాధ్యక్షులుగా మదిర కొమురయ్య, కోరే రాంబాబు, కంకల మధు, కోశాధికారిగా కంచు రాజేందర్, సలహాదారులుగా బండి మల్లయ్య, నరిగే సమ్మయ్య, బుర్రి కుమారస్వామి, గుంటి గట్టయ్య, విరాముష్టి కొమురయ్య, సహాయ కార్యదర్శులుగా సప్ప కృష్ణమూర్తి, కంబాల రాజయ్య, ఎగ్గెటి కుమారస్వామి, ఎగ్గటి రమేష్, గోవిందుల తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా అమృత అశోక్, కెంచు లక్ష్మణ్‌తో పాటు తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

సీతక్కపై ఆరోపణలతో సంబంధం లేదు..

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు

మంగపేట, జూలై 28: మంత్రి దనసరి సీతక్కపై వచ్చిన ఆరోపణలతో తమ సంఘానికి సంబంధం లేదని ములుగు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేములపల్లి రాజు స్పష్టం చేశారు. మండలంలోని కమలాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్కపై లారీ ఓనర్స్ అసత్యపు ఆరోపణలు చేశారని చెంచులక్ష్మి ఇసుక సొసైటీ, నర్సింహస్వామి ఇసుక సొసైటీ అధ్యక్షులు పత్రికా ప్రటనలు ఇచ్చారని తెలిపారు. రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రజలకు సేవలు చేయడం తప్ప ఎవరిపై కూడా ఎలాంటి ఆరోపణలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి తమది కాదని, తప్పుడు ప్రచారం చేయాల్సిన అవసరం కూడా లేదని అన్నారు. తమ పేరు చెప్పుకొని ఎవరైనా తప్పుడు ప్రకటనలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర రామకృష్ణ, కోశాధికారి ఎస్కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వన మహోత్సవం

మహదేవపూర్ రూరల్, జూలై 28: పలిమెల మండలంలోని పంకెన కస్తూర్బా పాఠశాలలో ఆదివారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీశాఖ రేంజ్ అధికారి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ మొక్కలు మానవాళికి ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. మొక్కలు నాటితే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు రాజేందర్, అఫ్జల్, కృష్ణ, వినోద్, బీట్ ఆఫీసర్లు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

- తాడ్వాయి: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో వనమహోత్సవం జరిగింది. ఈసందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అటవీశాఖ అధికారులు, విద్యార్థినులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో షౌకత్ హుస్సేన్, హాస్టల్ వార్డెన్ మోకాళ్ల లక్ష్మి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం జరిగింది. ఈసందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధరకాల మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శారద చెట్లను నాటడం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్య క్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మహాముత్తారం: మండల కేంద్రంలోని కస్తుర్బా పాఠశాలలో అటవీ శాఖ అధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆజంనగర్ రేంజర్ సత్యనారయణ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు సాంబయ్య, రజిత, ఎఫ్‌బీవోలు మంజుల, అనిల్, ప్రతిబాబు, శ్రీనివాస్, కస్తుర్బా సిబ్బంది పాల్గొన్నారు.
- కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కాటారం ఇంచార్జి రేంజర్ కిరణ్‌కుమార్ నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్ఎస్‌వో లు చంద్రశేఖర్, అర్చన, సుమన్, ఎఫ్‌బీవోలు అశోక్, మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కాటారం, జూలై 28: మండలంలో ఎండిపోయిన వృక్షాలు ప్రమాదాలకు సంకేతాలు ఇస్తున్నాయి. కాటారం-మంథని ప్రధాన రహదారి వెంట ధన్వాడ వద్ద, కాటారం సమీపంలో ఇలాంటి దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల నాటి వృక్షాలు కొన్ని నెలల క్రితం ఎండిపోయాయి. రోడ్డు పక్కనే ఉన్న ఇవి వానలకు నాని, ఎండలకు ఎండి ఎప్పుడు కుప్పకూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కనే ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



ధన్వాడ వద్ద ఎండిపోయిన భారీ వృక్షం

గోదావరిలో భక్తుల స్నానాలు

మహదేవపూర్, జూలై 28 : మండలంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి త్రివేణి గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఆదివారం సెలవు కావడంతో భారీ సంఖ్యలో తరలి వచ్చి ఉదయం నుంచి గోదావరి మాతకు పలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వరం ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి

మంగపేట, జూలై 28: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లికొండ యాదగిరి డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మాలమహానాడు నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. రాజుపేటలో విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని రాజుపేట పరిధిలో సుమారు 15 గ్రామాల ప్రజలు జ్వరాల బారినపడ్డారన్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు చొప్పున మూలుగుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు కారణమని విమర్శించారు.

అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలి

మల్హర్, జూలై 28: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే చర్యలను ప్రభుత్వం తక్షణ ప్రారంభించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రకటన చేయాలన్నారు. తాడిచర్లలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. వినూత్నంగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారుల గుర్తింపు, ఇంటి స్థలం, పెన్షన్, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, బోయిని రాజయ్య, ముడితనపెల్లి ప్రభాకర్, బూడిద సతీష్, చొప్పరి రాజు, సమ్మక్క, పార్వతి, పద్మ, వసంత, నవీన్, నాగయ్య, శంకరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

మంగపేట, జూలై 28: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సేన ములుగు డివిజన్ అధ్యక్షుడు పోలేబోయిన ఆదినారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని చుంచుపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పాలకవర్గం సమావేశాన్ని రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ సేన జిల్లా సభ్యులు ఆలం శ్రీను, పీరీల భాస్కర్, యానక లక్ష్మీనారాయణ, మంకిడి శ్రీను, కల్తీ రామకృష్ణ, పూసం ప్రశాంత్, కొడే లక్ష్మీనారాయణ, పసుల రాజు, పాయం నారాయణ పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 28: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య కోరారు. భూపాలపల్లిలో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జయశంకర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించి వినూత్న నిరసన తెలిపారు. రాష్ట్ర సాధనలో పాల్గొని కేసులపాలై, జైలుకెళ్లినా ఉద్యమారులకు గుర్తింపు లేదన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిం చాలన్నారు. ప్రతి ఉద్యమకారుడికీ 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరెడ్డి, మెండు వాణి, షరీఫా, రాజేశ్వరి, శారద, పుష్ప, సాంబలక్ష్మి, చింతల లత తదితరులు పాల్గొన్నారు



జయశంకర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

గడిచెరువు జలపాతం అదుర్స్



జలపాతం వద్ద పర్యాటకులు

వెంకటాపురం(నూగూరు), జూలై 28: మండలంలోని మహితాపురం గ్రామ సమీపం లోని గడిచెరువు జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. జలపాతానికి జలకళ సంతరించుకోవడంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. జలపాతాన్ని తిలకించేందుకు జిల్లాలోని పర్యాటకులతోపాటు వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాల్లోని పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా జలపాతం అందాలను తిలకిస్తూ సెల్‌ఫోన్‌లో బంధించుకున్నారు.

చారు మజుందార్‌కు నివాళి



చారు మజుందార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లిబరేషన్ పార్టీ నేతలు

టేకుమట్ల, జూలై 28: చారు మజుందార్ వర్ధంతిని మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. చారు మజుందార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో ఎంఎల్ పార్టీని స్థాపించి ఎన్నో ప్రజా ఉద్యమాలు చేపట్టిన నేత చారు మజుందార్ అని మల్లేష్ కొనియాడారు. ఎమర్జెన్సీ సమయంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని దేశవ్యాప్తంగా పార్టీని విస్తరించి దళిత, పీడిత వర్గాల పక్షాన పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనరవేన కుమార్, సాద శ్రీనివాస్, అంబాల ఆనందం, కొమరయ్య, మచ్చ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పోలీసుల చేయూత

వాజేడు, జూలై 28: వరదలు చుట్టుముట్టడంతో మండలంలోని బొమ్మనపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం నిత్యావసర సరుకులు కూడా లభించకపోవడంతో అల్లాడారు. విషయం తెలుసుకున్న వాజేడు ఎస్సై హరీశ్ పలువురి సహకారంతో బొమ్మనపల్లి గ్రామస్తులకు సీఐ కుమార్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, కూరగాయలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయటంలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఆదినారయణ, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాల వెతలు

చిన్న పాటి వర్షానికే రాకపోకలు బంద్

నిర్మాణం నోచుకోని వంతెనలు

లోలెవల్ కల్వర్టులతోనే సరి



కేశాపూర్-పెగడపల్లి పెద్దవాగు కల్వర్టు పరిస్థితి (ఫైల్)

మహాముత్తారం, జూలై 28: వానాకాల వెతలు మండల ప్రజలు తప్పడం లేదు. చిన్న వర్షానికి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. లోలెవల్ కల్వర్టులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో మారుమూల గ్రామాలతోపాటు కాటారం-మహా ముత్తారం మీదుగా మేడారానికి వెళ్లే వారికి అవస్థలు తప్పడం లేదు. లోలెవల్ కల్వర్టులు ఉన్న చోట వంతె నలు నిర్మించాలని మండల ప్రజలు అనాదిగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాటారం నుంచి మహాముత్తారం మీదుగా మేడారానికి ప్రభుత్వం డబుల్ రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో నిధుల కొరతతో వాగుల వద్ద వంతెనలకు బదులు లోలెవల్ కల్వర్టులు నిర్మాంచారు. కాటారం మండ లం పోతులవాయి వాగు, చింతకానివాగు, మహా ముత్తా రం మండలంలో కొర్లకుంటవాగు, ఆలుగువాగు, దౌతుపల్లి వద్ద కోనంపేటవాగు కేశాపూర్ వద్ద పెద్దవాగు, పాతరేగుల గూడెం వాగు, కొత్తరేగులగూడెం మత్తడి వాగు, సింగారం వాగులతో పాటు సింగారం కాలువపల్లి గ్రామాల మధ్య అన్ని వాగుకూ లోలెవల్ కల్వర్టులనే నిర్మించారు. దీంతో ప్రతి వర్షాకాలం రాకపోకలకు ఇబ్బం దులు అవు తున్నాయి. అదేవిధంగా మహాముత్తారం నుంచి కాటారం వెళ్లే దారిలో సబ్‌స్టేషన్ వద్ద కోనంపేట వాగు, వజినేపల్లి వద్ద అలుగువాగు లోలెవల్ కల్వర్టులు భారీ వర్షాలు కురిసినపుడు తెగిపోతున్నాయి. గత ఏడాది రెండు చోట్ల తెగిపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. మండలంలోని లోలెవల్ కల్వర్టులపై వంతెనలు నిర్మిం చాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు మాత్రం మహాముత్తారం సబ్‌స్టేషన్, వజినేపల్లి అలుగువాగు వద్ద గత ఏడాది రోడ్డు తెగిపోయిన చోట తాత్కాలికంగా మట్టి పోసి వదిలేశారు.

ఉపాధ్యాయులను సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలి

ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

ఏటూరునాగారం, జూలై 28 : తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక కార్యకర్తలకు సర్వీస్, లీవ్ రూల్స్, పెన్షన్ రూల్స్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. పర్వతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఎంఈవో, డీఈవో, డిప్యూటీ డీఈవోకు ప్రమోషన్లు, జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, సమగ్ర శిక్ష పరిధిలోని ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేస్తూ రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఏవీ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం క్రిష్ణయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు మంచర్ల వీరభద్రం, ప్రధాన కార్యదర్శి వంకుడొత్ రాంబాబుతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.